క్లుప్తంగా

ఉచిత నేత్ర వైద్య శిబిరం



నరసరావుపేట: పట్టణంలోని నిమ్మతోట శ్రీ సిల్మన్ మెమోరియల్ మున్సిపల్ ప్రైమరీ స్కూలులో నార్ల ఫౌండేషన్, మూడో వార్డు తెలుగుదేశం పార్టీ, డాక్టర్ రామలింగారెడ్డి మాక్స్ విజన్ కంటి ఆసుపత్రి ఉమ్మడి సౌజన్యంతో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబులు విచ్చేశారు. డాక్టర్ చెంచిరెడ్డి 200 మందికి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో హరేరామ సంకీర్తన



నూజెండ్ల: హనుమత్ జయంతి ఉత్సవాలలో భాగంగా నూజెండ్లలో హనుమాన్ దీక్షా స్వాములచే హరేరామ సంకీర్తన ఆదివారం భక్తిశ్రద్ధలతో జరిగింది. విశ్వక్సేన పూజతో ప్రారంభమైన ఈ ఉత్సవాలలో భాగంగా ఆదివారం నగర ఉత్సవం జరిగింది. 19న గ్రామదేవతలకు పూజ, 20న స్వామి వారికి తోమాల సేవ, హనుమాన్ చాలీసా పారాయణం, 21న సహస్ర కలశాభిషేకం, 22న స్వామి వారికి విశేషాలంకరణ, సామూహిక హనుమత్ వ్రతాలు, ఇరుముడి కార్యక్రమం, గ్రామస్తుల సహకారంతో అన్నప్రసాద వితరణ, దీక్షా స్వాముల జాపాలి యాత్ర, 23న పూర్ణాహుతి, పీఠం ఉద్వాసన కార్యక్రమాలు ఉంటాయని అర్చకుడు రామ మోహనాచార్యులు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం



నాదెండ్ల: వేసవి ఎండల ధాటికి విలవిల్లాడిన ప్రజలు శుక్ర, శనివారాల్లో కురిసిన వర్షానికి కాస్త సేదతీరారు. శుక్రవారం ముందు వరకు ఉదయం నుంచి సాయంత్రం వరకూ తీవ్ర ఎండతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. వడగాల్పులు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. శనివారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కురిసిన వర్షానికి కొన్ని చోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. గణపవరం నుంచి చవిటిపాలెం రోడ్డులో విద్యుత్ తీగ తెగి పడింది. తర్వాత సిబ్బంది సరఫరాను పునరుద్ధరించారు.

లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు



నాదెండ్ల: మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలో లోఓల్టేజీ సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు సాక్షిలో ఇటీవల వచ్చిన కథనానికి విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలని పశువుల ఆసుపత్రి ఏరియా వాసులు ఫిర్యాదు చేశారు. గతేడాది ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు అధికారులు దిమ్మె ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ బిగించలేదు. ఆదివారం ఈ ప్రాంతంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంటు స్తంభాలు ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

ఎస్సీ యువకులకు ఉద్యోగ అవకాశాలు

నకరికల్లు: నిరుద్యోగ ఎస్సీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జాబ్స్ రిసోర్స్‌పర్సన్ శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పనా సంస్థ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్స్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఎస్సీ యువకులకు ఉచిత శిక్షణ, ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. వయస్సు 18–35 లోపు కలిగి పదోతరగతి ఉత్తీర్ణత లేదా ఫెయిల్ అయి ఉండవచ్చన్నారు. లిడ్‌కాప్ పేరుతో నల్లపాడులో 45 రోజులపాటు కుట్టు, కటింగ్‌పై ఉచిత వసతితో కూడిన శిక్షణనిస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి శ్రీ సిటి, తడలో ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. ఉద్యోగం పట్ల ఆసక్తి లేనివారికి సొంత వ్యాపారానికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సోమవారం నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని ఆసక్తి గల వారు 99084 82907 నంబరును సంప్రదించవచ్చన్నారు.

భూసార పరీక్ష.. అన్నదాతలకు రక్ష

- పోషకాల ఆధారంగా ఎరువులు వినియోగించాలి
- సమస్యాత్మక భూములకు ఎంతో ఉపయోగకరం



భూసార పరీక్షలు చేస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

శావల్యాపురం: భూసార పరీక్షల వలన భూమి సారవంతంగా మారి ఆశించిన స్థాయిలో పంట దిగుబడులు పెరుగుతాయి. భూమిలో పోషకాల ఆధారంగా ఎరువులు వినియోగిస్తే నేల ఆరోగ్యంగా ఉంటుంది. అవసరాన్ని మించి ఎరువుల వినియోగించటం వలన భవిష్యత్‌లో సాగు భూముల్లో ఉండే పోషకాల శాతం తగ్గి చౌడుగా మారే పరిస్థితి నెలకొంటుంది. రైతులు అధికంగా సేంద్రియ ఎరువుల వినియోగింటం ద్వారా ఆరోగ్యకరమైన పంటలను సాగు చేసుకోవచ్చు. రానున్న ఖరీఫ్ సీజనుకు నియోజకవర్గంలో వ్యవసాయ అధికారుల సారథ్యంలో రైతు సేవా కేంద్రంలోని వీఏఏలు మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేస్తున్నారు. పరీక్ష ఫలితాల ఆధారంగా యాజమాన్య పద్ధతుల ద్వారా రైతులు సాగు చేసేలా చర్యలు తీసుకుంటారు.

పోషకాలు కీలకం

భూమిలో పదహారు రకాల పోషకాలు మొక్కకు ఉపయోగపడతాయి. రైతులు సాగు చేసే పంటల ఆధారంగా పోషకాలు మొక్కలు అందాల్సి ఉంటుంది. పప్పుధాన్యాలు సాగు వలన భూమిలో పోషకాల శాతం పెరుగుతుందని వ్యవసాయ అధికారులు చెప్పారు. ఇప్పటికే ఉన్న పోషకాల ఆధారంగా ఎరువులను వినియోగించాలి. సూక్ష్మధాతువుల వినియోగం సరిగా లేనందున దిగుబడులు తగ్గుతాయి. పంటకు పోషకాలు సకాలంలో అందితే ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తాయి. భూసార పరీక్షలతో భూమి ఆరోగ్యవంతంగా మారుతుంది.

ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలి



వినుకొండ నియోజకవర్గంలో 70 రైతు సేవా కేంద్రాల ద్వారా 3,900 మట్టి నమూనాలు సేకరించాం. నరసరావుపేట మట్టి పరీక్షల కేంద్రానికి పంపించి ఫలితాలను విశ్లేషించాం. నివేదిక ఆధారంగా సమస్యాత్మక భూములను గుర్తిస్తున్నాం. పచ్చిరొట్ట, ఎరువులు, జిప్సమ్, పశువుల ఎరువును వినియోగించేలా చర్యలు చేపట్టి భూములు సారవంతంగా తయారయ్యేలా రైతుల్లో చైతన్యం పెంచుతున్నాం. నత్రజని, భాస్వరం, పొటాషియం, సూక్ష్మపోషకాలను కూడా పరీక్షా ఫలితాల ఆధారంగా వినియోగించాలి.

– బోయపాటి రవిబాబు, ఏడీఏ, వినుకొండ

పోషకాల కొరత గుర్తించేలా పరీక్షలు



భూసార పరీక్షల ఆధారంగా మాలాంటి రైతులకు మేలు చేకూరుతుంది. భూమిలో ఉండే పోషకాల కొరతను గుర్తించవచ్చని అధికారులు చెబుతున్నారు. ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగించటం వల్ల అవసరమైనవి వాడుతున్నాం.

– మర్రి దుర్గారావు, రైతు, శావల్యాపురం

దేశభక్తిని చాటేలా తిరంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శావల్యాపురం: మండల కేంద్రంలో దేశభక్తిని చాటేలా తిరంగా ర్యాలీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు గట్టుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ దేశానికి సంబంధించిన భద్రత విషయంలో ఆర్మీకి, కేంద్ర ప్రభుత్వానికి మద్దతుగా ఉండాలని పిలుపునిచ్చారు. భారత్‌మాతా కీ జై.. అంటూ నినాదాలు చేశారు. యుద్ధంలో వీరమరణం పొందిన అమర వీరులకు జోహార్లు అర్పించారు. జాతీయ జెండాలతో ప్రధాన వీధుల్లో ర్యాలీ కొనసాగింది. పాకిస్తాన్ డౌన్..డౌన్.., ఉగ్రవాదం నశించాలి.. అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పత్తి మణికంఠనాయుడు, ఎంపీ అప్పారావు, వెంకయ్యనాయుడు, గోపు శ్రీనివాసరావు, డీసీ చైర్మన్ మండలపు వెంకట నారాయణ, సిద్ధయ్య, దివ్యకోలు నాగేశ్వరరావు, ఆంజనేయ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు పట్టణంలో నిర్వహణ

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: ఆపరేషన్ సిందూర్ విజయవంతం చేసిన సైనిక దళాలకు సంఘీభావంగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు నేతృత్వంలో సోమవారం తిరంగా యాత్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీడీపీ పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్‌ఖాన్ ఆదివారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ఎన్ఆర్‌టీ సెంటర్ నుంచి గడియార స్తంభం వరకు ఈ యాత్ర కొనసాగుతుందన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన



పరీక్షలు చేస్తున్న డాక్టర్ మేఘన

చిలకలూరిపేట టౌన్: చిలకలూరిపేట మండలం కట్టుబడివారిపాలెం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం ఉచిత మెగా నేత్ర వైద్యశిబిరానికి స్పందన లభించింది. స్వచ్ఛ సేవ టీం (కట్టుబడివారిపాలెం, యక్కలవారిపాలెం, ఏపూరివారిపాలెం) ఆధ్వర్యాన జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి సంయుక్త సహకారంతో శిబిరం ఏర్పాటైంది. ఆస్పత్రి వైద్యులు మేఘన, ధృవ్, సిబ్బంది పాల్గొన్నారు. 116 మందికి పరీక్షలు చేసి 50 మందికి శస్త్ర చికిత్సలు చేయాలని నిర్ధారించారు. ఈ మేరకు క్యాంపు కోఆర్డినేటర్ బి.సైదులు బాబు తెలిపారు. సోమవారం వీరికి ఉచిత శస్త్రచికిత్సలు చేయనున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటి సమస్యలపై అవగాహన పెంచడానికి స్వచ్ఛ సేవ టీం ఆదివారం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసింది. నల్లజర్ల ప్రసన్నకుమార్, నక్క బాజీబాబు, కొంగర వీరేంద్రనాథ్, యక్కల లక్ష్మీనారాయణ, మజ్జిగ శ్రీనివాసరావు, రాజేష్, ముత్యాల కోటయ్య, సుంకర గౌరీ శంకర్, బొమ్మసాని ప్రసాద్, నాగార్జున, బోయపాటి మల్లికార్జున, గుంటుపల్లి రామకోటేశ్వరరావు, చలిచీమ వీరాంజనేయులు, మేరం నాగబాబు, చిట్టిబోయిన కోటయ్య పాల్గొన్నారు.

దళిత విద్యార్థిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ఏపీ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి ప్రతినిధులు



సమావేశంలో పాల్గొన్న ఏపీ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి ప్రతినిధులు

క్రోసూరు: దళిత విద్యార్థి జేమ్స్‌ను కొట్టి మూత్రం తాగించిన యశ్వంత్ నాయుడు, రౌడీ షీటర్లు రూపేష్, చోటాబ్లేడ్, కిరణ్, జగ్గ, నానీలను వెంటనే అరెస్టు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం క్రోసూరులోని ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండలి అధ్యక్షుడు బుల్లా రాజారావు మాట్లాడుతూ తిరుపతి జిల్లా చంద్రగిరి సమీపంలో ఓ కళాశాలలో బీటెక్ విద్యార్థి జేమ్స్ అనే దళిత యువకుడిని కులం పేరుతో అదే కళాశాలలో చదివే జూనియర్ విద్యార్థి యశ్వంత్ నాయుడు, రౌడీషీటర్లతో కలిసి కొట్టడమే కాకుండా మూత్రం పోసి తాగించారని ఆరోపించారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ కేసు తీసుకోకపోవటం దుర్మార్గమని అన్నారు. పోలీసులే కొంతమంది పేర్లు తొలగించి ఫిర్యాదు రాసి బాధితుడితో సంతకం తీసుకోవటం జరిగిందని, నిందితులకు సహకరించిన పోలీసులను సస్పెండ్ చేయాలని, నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు, కిడ్నాప్ కేసు, అటెంప్ట్ టు మర్డర్ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో గార్లపాటి దాసు, అద్దేపల్లి క్రిస్టఫర్, చిలక భాస్కరరావు, కంచర్ల అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మద్దతు ధర కల్పించాలి

వ్యవసాయ కార్మిక సంఘాల కార్యదర్శి హనుమంతరావు



మాట్లాడుతున్న హనుమంతరావు

అచ్చంపేట: రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రకటించిన రూ.20 వేలు తక్షణమే అందించాలని డిమాండ్ చేస్తూ అచ్చంపేట, క్రోసూరు మండలాల వ్యవసాయ కార్మిక సంఘాల కార్యదర్శి హనుమంతరావు ఆదివారం అచ్చంపేటలో ప్రచార రథం ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధులు పెంచి 200 రోజుల పని దినాలు కల్పించాలని, వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లు నిషేధించాలని, నూతన కౌలు చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని అన్ని గ్రామాలలో తిరిగి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై రైతులకు కరపత్రాల ద్వారా అవగాహన కల్పించారు. మే 20వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లో జరిగే నిరసన కార్యక్రమానికి అధిక సంఖ్యలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపూరి వెంకటేశ్వరరావు, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు జూదరులు అరెస్టు

నాదెండ్ల: గ్రామ శివారులో పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఎస్సై జి. పుల్లారావు తెలిపిన వివరాల మేరకు.. గొరిజవోలు గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఐదుగురు జూదరులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.16,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎస్సీ హాస్టల్‌లో వంట పాత్రలు చోరీ

నాదెండ్ల: గణపవరం శాంతినగర్ మూడో సచివాలయం సమీపంలో ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహంలో వంట పాత్రలు చోరీకి గురైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. కొన్నేళ్లుగా ఈ వసతి గృహానికి వార్డెన్‌గా తిరుపతయ్య, నైట్ వాచ్‌మెన్‌గా దేవి విధులు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల క్రితం తిరుపతయ్య సెలవు పెట్టారు. దేవి శనివారం రాత్రి హాస్టల్‌కు వెళ్లగా.. వంట గదిలో పాత్రలు కనిపించలేదు. చోరీకి గురైనట్లు గుర్తించి వెంటనే వార్డెన్‌కు సమాచారమిచ్చారు. ఆయన సూచన మేరకు ఆదివారం నాదెండ్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొందరు మహిళలు చెత్త ఏరుకున్నట్లు నటించి ఇలా చోరీలకు పాల్పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

ఆక్రమణల తొలగింపు



నరసరావుపేట రూరల్: ములకలూరు సమీపంలో ఎన్ఎస్‌పీ కాలువను ఆక్రమించి అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను ఆదివారం తొలగించారు. సత్తెనపల్లి రోడ్డులో ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ వెంచర్ కోసం ఎన్ఎస్‌పీ కాలువలను ఆక్రమించడంతోపాటు రోడ్ల నిర్మాణాలను సంస్థ చేపట్టింది. దీనిపై ప్రజా సంఘాలు, రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ వెంచర్‌పై చర్యలు తీసుకోవాలంటూ పీడీఎం నాయకులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో సంస్థ ఆ నిర్మాణాలను ఆదివారం తొలగించడం ప్రారంభించింది. అధికారుల ఒత్తిడి కారణంగా ఈ చర్యకు పూనుకున్నట్లు తెలుస్తోంది. తొలగింపును పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు పరిశీలించారు.

ఆయిల్ మిల్‌లో అగ్నిప్రమాదం

నరసరావుపేట రూరల్: సత్తెనపల్లి రోడ్డులోని ఆంజనేయులు ఆయిల్ మిల్‌లో ఆదివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఫైర్ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. మిల్‌లోని జనరేటర్ రూమ్‌లో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన కార్మికులు అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. మంటలు వ్యాప్తి చెందకుండా చూశారు.

చినుకు పడితే ప్రయాణికులకు అవస్థలే..!



నరసరావుపేట: ఎన్నాళ్లు గడిచినా ఆర్టీసీ బస్టాండ్ పరిస్థితి మారట్లేదు. ఏ చిన్నపాటి వర్షం కురిసినా నీరు ఆగి చిత్తడి చిత్తడిగా మారుతోంది. ఈ బస్టాండ్ నుంచి రోజూ వేలాదిమంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. నీరు నిలవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. శుక్ర, శనివారాల్లో పడిన వర్షంతో బస్టాండ్‌లోకి ప్రవేశించే మార్గాల్లో నీరు నిలిచిపోయింది. బస్టాండ్ పరిసర ఉన్న ప్రాంతాలు ఎత్తుగా ఉండటం, డ్రైనేజ్ సక్రమంగా లేక సమస్య తీవ్రమవుతోంది. ఇప్పటికైనా అధికారులు పరిస్థితిని చక్కదిద్దాలని ప్రయాణికులు కోరుతున్నారు.

• స్తంభం శిథిలం.. పొంచి ఉన్న ప్రమాదం





మండలంలోని వేల్పూరు గ్రామం ప్రధాన కూడలి మార్గంలో విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఎస్‌బీఐ బ్యాంకు సమీపాన ఇది ఉండటంతో రద్దీ సాధారణమైంది. స్తంభం కింది భాగం శిథిలం కావడంతో ఏ క్షణాన కూలి మీద పడిపోతుందోనని స్థానికులు భయపడుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. - శావల్యాపురం

విద్యార్థి జేమ్స్‌పై దాడి అమానుషం

భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు



మాట్లాడుతున్న సీహెచ్ సుబ్బారావు

చిలకలూరిపేట టౌన్: తిరుపతి జిల్లా చంద్రగిరి సమీపంలోని విద్యానికేతన్ ఇంజినీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం విద్యార్థి జేమ్స్‌పై జూనియర్ విద్యార్థి యశ్వంత్ నాయుడు తన మిత్రులతో కలిసి దారుణంగా దాడి చేసిన ఘటనను భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు ఆదివారం తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హాకీ స్టిక్, కత్తులతో దాడి చేయడమే కాకుండా అమానుషంగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే దోషులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాలేజీ అనుమతిని రద్దు చేయాలని, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా విద్యా సంస్థలు తమ కళాశాలలో భద్రతకు భరోసా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రైవేటు కళాశాలలలో అన్ని వర్గాల ప్రతిభావంతులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో పి. శ్రీకృష్ణదేవరాయలు, నలమాల జీవరత్నం, కొర్రపాటి విజయకుమార్, నల్లమల ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలో సీపీఐని బలోపేతం చేయాలి

సీపీఐ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు రామకృష్ణ



పార్టీజెండా ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

అమరావతి: నిరంతరం ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్వహిస్తున్న సీపీఐని గ్రామీణ ప్రాంతాలలో బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్య మండలి పల్నాడు జిల్లా కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అమరావతి సీపీఐ శాఖ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు శీలం ముని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలతో పాటు రైతులు, రైతు కూలీలు, అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాడుతుందన్నారు. పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు మాట్లాడుతూ సీపీఐ కార్యకర్తలు, నాయకులు నిర్వహించే ప్రజా ఉద్యమాలలో ప్రజలను భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉందన్నారు. మండల సీపీఐ కార్యదర్శి కారంపూడి చెన్నకేశవరావు ఆధ్వర్యంలో మండల కమిటీ సభ్యులు, కార్యకర్తలు, నాయకులు తొలుత పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాంబాబు, ఉదయ శేఖర్, మైలా మాధవరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరావతి సీపీఐ శాఖ కార్యదర్శిగా శీలం ముని

ఈ సమావేశానంతరం నిర్వహించిన అమరావతి సీపీఐ శాఖ కార్యవర్గ ఎన్నికలో అమరావతి సీపీఐ శాఖ కార్యదర్శిగా శీలం ముని, సహాయ కార్యదర్శిగా మంత్రాల యేసు, కమిటీ సభ్యులుగా టి.వెంకటేశ్వరరావు, పి.వెంకటేశ్వరరావు, గాలం సాబ శివరావు, మాధవరావు, బి.వేదాంతం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ప్రభుత్వాలు



మాట్లాడుతున్న తోట ఆంజనేయులు

వినుకొండ: పట్టణంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం పట్టణ కార్యదర్శి ఎస్‌కే ఫిరోజ్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జిల్లా కార్యదర్శి తోట ఆంజనేయులు మాట్లాడుతూ.. దేశం, రాష్ట్రంలో ప్రభుత్వాలు రెండూ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా పనిచేస్తూ కార్మికులకు, రైతులకు హాని చేసే చట్టాలు తీసుకొస్తున్నాయని ఆరోపించారు. ఆర్థిక సంక్షోభంలో దేశం కూరుకుపోతోందని తెలిపారు. ప్రజల మధ్య మతాల పేరుతో వైరుధ్యాలు పెంచుతూ రాజకీయ మనుగడ కొనసాగిస్తున్నాయని విమర్శించారు. అనంతరం 11 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఎస్‌కే ఫిరోజ్, మునగపాటి ప్రసాద్, కామా వెంకటేశ్వర్లు, పల్లపాటి భాస్కర్, ముప్పాళ్ల ప్రసాద్, వెంకయ్య, జయరావు, కొండలు, యలమంద, నాగులు, షారుఖ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో ప్రతిభ చూపిన యశ్వంత్‌కు సత్కారం



సత్తెనపల్లి: టెన్త్ సీబీఎస్ఈ ఫలితాల్లో 486/500 మార్కులు సాధించి ప్రతిభ చూపిన సత్తెనపల్లి పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం విద్యార్థి జొన్నలగడ్డ యశ్వంత్‌ను ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో సత్కరించారు. సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడు గ్రామంలో ఆదివారం యశ్వంత్‌ను సత్కరించి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అధికారి పాలెపోగు సుమని, ఎంఈఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు గరికపాటి హిట్లర్, జాయింట్ సెక్రటరీ విజయ్ వర్ధన్, ఉపాధ్యాయులు రామకోటయ్య, సురేష్ ఎస్‌బీఐ మేనేజర్ మణిదాస్, హెడ్ క్యాషియర్ జాన్సన్, ప్రేమ్ కుమార్, చిలుక రమణయ్య, లక్కరాజుగార్లపాడు గ్రామస్తులు పాల్గొన్నారు.